విద్యుత్‌తో అప్రమత్తం

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు
- విద్యుత్ వైరింగ్, మోటార్లకు ఎర్త్ తప్పనిసరి
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



పొలంలో మోటారు స్విచ్ ఆన్ చేస్తున్న రైతు (ఫైల్)

జి.కొండూరు: వర్షాలు పడుతున్న క్రమంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఇనుప విద్యుత్ స్తంభాలు, మోటార్ల వద్ద వైర్లు, విద్యుత్ స్తంభాలకు సపోర్టుగా ఉంచిన తన్నుడు తీగల వల్ల ప్రమాదాలు ఎక్కుగా జరిగి ప్రాణ, ధన, ఆస్తి నష్టాలు జరిగే అవకాశం ఉంది. ఇళ్లలో వినియోగించే మోటార్లు, వ్యవసాయ అవసరాలకు వినియోగించే విద్యుత్ మోటార్ల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలు, తన్నుడు తీగలు, స్టార్టర్ బోర్డులకు విద్యుత్ సరఫరా అయినప్పుడు వాటిని తెలియక పట్టుకొని రైతులు, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

పాటించవలసిన జాగ్రత్తలు

- విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, బల్బులు, మోటార్లు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇంట్లో విద్యుత్ వైరింగ్, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు ఎర్త్ ఉండేలా చూసుకోవాలి.
- దుస్తులు ఆరవేయడానికి ఇనుప తీగలు వినియోగించకూడదు.
- తడి చేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలు, హోల్డర్లు, సర్వీసు వైర్లు, స్విచ్‌లు తాకకూడదు. పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు, విద్యుత్ పరికరాలు ఉండేలా చూసుకోవాలి.
- ఉరుములు, మెరుపులు, వర్షం కురిసే సమయంలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, కంప్యూటర్లకు విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి.
- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించి కొత్త తీగలను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుదాఘాతానికి గురైతే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. సదరు వ్యక్తిని పొడి కర్రతో లేదా ప్లాస్టిక్ వస్తువులతో తొలగించి ఆస్పత్రికి తరలించాలి.
- పొలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ తీగల కింద బురదలో లేకుండా చూసుకోవాలి. మోటార్లకు నాణ్యమైన విద్యుత్ తీగలనే వాడాలి. విద్యుత్ మోటార్లను తడి చేతులతో తాకకూడదు.
- విద్యుత్ తీగలు తెగిపడినట్లు గమనిస్తే వెంటనే సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం అందించాలి.
- విద్యుత్ మోటార్లకు, స్టార్టర్లకు ఇనుప బాక్సులను కాకుండా ప్లాస్టిక్ బాక్సులను మాత్రమే అమర్చాలి.

విద్యుత్ ప్రమాదాలు కొన్ని..

- జి.కొండూరు మండల పరిధిలోని వెల్లటూరు శివారులో సపోటా తోటలో కాపలాదారుడిగా ఉంటున్న జరపల బాబు(48) 2022 అక్టోబరు 19న వర్షాలు పడుతున్న క్రమంలో తోటకు నీటి అవసరం లేదని ఆటోమేటిక్‌గా పనిచేస్తున్న విద్యుత్ మోటారును ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో స్విచ్ బోర్డుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి బాబు అక్కడికక్కడే మృతి చెందాడు.
- జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ కావిటి బోగేశ్వరరావు(33) తన ఇంట్లోకి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 2019 జూలై 20న రాత్రి ఏడు గంటల సమయంలో కర్రతో విద్యుత్ స్తంభంపై తన ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే తీగను కదిలించాడు. కర్రకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురై రోడ్డుపై పడి తలకు బలమైన గాయమై మృతి చెందాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పాడి పశువులను మేతకు తోలుకెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ భూముల్లో మోటార్లు, విద్యుత్ తీగలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వర్షం పడుతున్న సమయంలో ప్రజలు విద్యుత్ పరికరాలను తాకవద్దు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తినా విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌ని సంప్రదించాలి.

– షేక్ మహ్మద్ షఫీ,
విద్యుత్ శాఖ ఏఈ, జి.కొండూరు

పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు



చాట్రాయి: తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం సామూహిక సెలవులు పెట్టి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సచివాలయాల్లో డీడీఓ వ్యవస్థ వద్దని, పాత పంచాయతీ వ్యవస్థనే అమలు చేయాలని, పారిశుద్ధ్య పనుల్లో ఐవీఆర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందచేశారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

ఆగిరిపల్లి: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని నుగొండపల్లి మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో విజయవాడకు చెందిన దాత కొలకలూరి ప్రసాద్ రాజు విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ఎంఈఓ ఆనంద్ కుమార్ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జలసూత్రం వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రావణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఆగిరిపల్లి: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ అన్నారు. శనివారం ఆగిరిపల్లి, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల వివరాల నమోదు రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలు, రక్త పరీక్షలు, మందులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా, టీకాలు ఇప్పించడంతో ప్రయోజనాలను వివరిస్తూ తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు, మంజుల దేవి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

5న న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు: నూజివీడు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జులై 5న స్థానిక న్యాయస్థానాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు లోక్ అదాలత్‌లో పాల్గొని రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. దీనివల్ల కక్షిదారులు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఖ్యాతి నేత్ర వైద్యశాల వైద్యురాలు శ్రావణ సంధ్య బృందం 485 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 51 మందికి కళ్లజోళ్లు అవసరమైనట్లు గుర్తించారు. వీరికి కళ్లజోళ్లకు అవసరమైన ఆర్థిక సాయాన్ని తుమ్మల నరేన్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కందుల సత్యనారాయణ, హెచ్ఎం డీవీఎల్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్‌ను హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నేమాల వీరవెంకటేశ్వరరావు దంపతులు అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రధానోపాధ్యాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి 100 గంటల అఖండ భజన

తిరువూరు: భగవాన్ సత్య సాయిబాబా 100వ పుట్టినరోజు సందర్భంగా తిరువూరులోని సత్యసాయి మందిరంలో 100 గంటల అఖండ భజన కార్యక్రమం నిర్వహిస్తామని కన్వీనర్ దామెర్ల ప్రభాకరరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జూలై 3వ తేదీ రాత్రి 7 గంటల వరకు అఖండ భజన జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం జూలై ఏడున ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాశ్ మాదిగ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆ సంస్థ అనుబంధ సంఘాల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీల ఏర్పాటు, నూతన జెండా దిమ్మెల ఏర్పాట్లు శరవేగంగా జరగాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆదూరి నాగమల్లేశ్వరరావు, మందా పిచ్చియ్య, లింగాల నరసింహులు, మొండితోక విజయ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ప్రారంభం

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని శ్రీ మన్నారాయణ కాంప్లెక్స్‌లో నూతనంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గ్రోమోర్ సెంటర్‌ను ఏరియా మేనేజర్ సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యత కలిగిన పురుగుమందులు, ఎరువులు, అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన శ్రీమన్నారాయణ, బ్రాంచ్ మేనేజర్ సాయిరాం, రవి పాల్గొన్నారు.

రబ్బీష్ అక్రమ రవాణా

లారీలను అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



రబ్బీష్ లారీలను అడ్డుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ శివారు షాబాదు గ్రామంలో రబ్బీష్ క్వారీ నుంచి వెళుతున్న రబ్బీష్ లోడు లారీలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శనివారం అడ్డుకున్నారు. పైడూరుపాడు, రాయనపాడు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు చేస్తున్న రోడ్డు కాంట్రాక్టు పనులకు అవసరమైన రబ్బీష్‌ను అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కార్యదర్శి తగరం సాంబయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు లారీలను అడ్డుకున్నారు. లారీల యజమాని అదే గ్రామానికి చెందిన వ్యక్తి కావడం తో గ్రామస్తులు జోక్యం చేసుకుని భవిష్యత్‌లో అక్రమంగా రబ్బీష్ రవాణా జరుగకుండా ఉమ్మడిగా చర్యలు తీసుకుందామని చెప్పడంతో లారీలను వదిలివేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కార్యదర్శి తగరం సాంబయ్య, కార్యకర్తలు తగరం నాగరాజు, నందిపాముల జాన్‌కోటి, నందిపాముల రవికుమార్, ప్రభాకర్, మాడుగుల నాగేశ్వరరావు, వేదల నాగరాజు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తిరువూరు: యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. సిందూర అన్నారు. తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాల వ్యతిరేక సదస్సు నిర్వహించారు. జడ్జి సిందూర మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్ అంధకారమయమవుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఉచిత విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిద్ధయ్య, ఏజీపీ రాము, ఉచిత న్యాయ సలహాదారు మేకల నాగేంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేయాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నరసింహ



మాట్లాడుతున్న నిమ్మగడ్డ నరసింహ

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినప్పటికీ చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ విమర్శించారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూజివీడు, విస్సన్నపేట, చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. పట్టణంలోని పెద్ద చెరువును, మీర్జాపురం వెంకన్న చెరువులను మినీ రిజర్వాయర్‌లుగా అభివృద్ధి చేయాలని, ఆగిరిపల్లి మండలంలోని బ్రహ్మలింగం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. నూజివీడు ప్రాంతంలో మామిడి తోటలు అధిక విస్తీర్ణంలో ఉన్నందున ప్రభుత్వం మామిడి పల్ప్ యూనిట్‌ను ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మదుపల్లి నాగేంద్రరావు పాల్గొన్నారు.

రేపటితో విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ గడువు ముగింపు

ఇబ్రహీంపట్నం: గృహ వినియోగదారుల విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ గడువు సోమవారంతో ముగుస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ వసంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విద్యుత్ వినియోగం కోసం 1 కిలో వాట్, 2 కిలో వాట్ సామర్థ్యం కలిగిన లోడుతో సర్వీసులు తీసుకున్న వారు కాలానుగుణంగా ఇంట్లో పెరిగిన గృహోపకరణాలతో లోడు సామర్థ్యం పెరిగిందన్నారు. అటువంటి వారు 50 శాతం సబ్సిడీతో లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. 1 కిలో వాట్ సబ్సిడీ ధర రూ.1,250, 2 కిలో వాట్స్‌కు రూ.2,450, 3 కిలో వాట్స్‌కు రూ.3,650, 4 కిలోవాట్స్‌కు రూ.4,850, 5 కిలోవాట్స్‌కు రూ.6,050 చొప్పున గడువులోగా చెల్లించి లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాలని చెప్పారు.

రహదారి నిర్మాణానికి తీర్మానం ఎప్పుడు?

అనుముల్లంక ఎంపీటీసీ కమల



గంపలగూడెం మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

తిరువూరు: తమ గ్రామంలో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి లభించినా, పంచాయతీ తీర్మానం చేయనందున పని చేపట్టకపోవడం శోచనీయమని గంపలగూడెం మండలం అనుముల్లంక ఎంపీటీసీ సభ్యురాలు గొరసాని కమల అన్నారు. గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. గత సమావేశంలో ఆరు రహదారుల నిర్మాణానికి రూ.13 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు కాగా గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేయకపోవడంతో పనులు జరగలేదన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కమల వాపోయారు. గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. మండలంలోని పలు గ్రామాల సమస్యలపై సమావేశంలో చర్చించారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు నివాళి



మైలవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతిపథంలో నడిపారని కాంగ్రెస్ పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొర్ర కిరణ్ అన్నారు. పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం మైలవరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరువూరు: భారత మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం జరిగింది. పీవీ చిత్రపటానికి కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, జీవన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి లక్ష్మీదాసు పూలమాల వేసి నివాళులర్పించారు. గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలను కమిటీ నిర్వాహకులు ఊటుకూరు నారాయణరావు, రిటైర్డు ప్రిన్సిపాల్ వెదురు వెంకటరెడ్డి వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం

నూజివీడు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం అన్నారు. పట్టణంలోని చైతన్య స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి జడ్జి మాట్లాడుతూ విద్యార్థుల కోసం విద్యా హక్కు చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం వంటివి ఉన్నాయన్నారు. మోటర్ వెహికల్ యాక్ట్ గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని చెప్పారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్ల వయస్సు వరకు ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా బడికి వెళ్లి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా చట్టాలను తెలుసుకొని విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్‌కేడీ ప్రసాద్, ప్రిన్సిపాల్ రామ్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



మునుకుళ్ల(తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రవాసాంధ్రుడు రామ్‌చరణ్ పవన్ శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. జామెంట్రీ బాక్సులు, కాపీ రైటింగ్ పుస్తకాలు, మ్యాప్ పాయింటింగ్ బుక్స్, నోట్ బుక్స్ వితరణగా ఇచ్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కేపల్లి మురళీకృష్ణ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శుభశేఖర్

ఆగిరిపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వాడకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉంటున్నాయని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు చెప్పారు. వారికి వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

వడ్డీ పడకుండా పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రైయినేజీ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించాలని సూచించారు. వడ్డీ పడకుండా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

స్వయం ఉపాధికి ఫిక్కీ ఫ్లో శిక్షణ



శిక్షణ ప్రారంభోత్సవంలో ఫిక్కీ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూగ, బధిర విద్యార్థులు, మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్, సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమృత కుమార్ మాట్లాడుతూ మూగ బధిర మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో మూడు నెలల శిక్షణ ప్రారంభించామని చెప్పారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీలో నైపుణ్యాన్ని పెంపొందించి, స్వయం ఉపాధి ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఫిక్కీ ఫ్లో ఇనీషియేటింగ్ హెడ్ విజయలక్ష్మి మాట్లాడుతూ మూగ, బధిర విద్యార్థులు, మహిళలు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన తరువాత స్వయం ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. దానికి ఫ్లో ద్వారా సహకారాన్ని అందిస్తామని చెప్పారు. శిక్షణలో భాగంగా గూగుల్ స్కెచప్, ఆటోక్యాడ్, ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, స్క్రీన్ ప్రింటింగ్ నేర్పిస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

నందిగామరూరల్: వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. పట్టణంలోని మధిర రోడ్డులో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలన్నారు. హెల్మెట్, వాహనాల పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. అనంతరం హెల్మెట్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతో వాహనం నడుపుతున్న వ్యక్తిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.